# తాంబూలము

పూజా విధానములో తాంబూలముంచుట కూడ కలదు. తాంబూలములో 1. ఆకు, 2. వక్క 3. సున్నము పూర్వ కాలములో ఉంచెడివారు. తాంబూలములో ఆకు విశాలమైనది. దానికంటే తక్కువ పరిమాణము కలది వక్క. వక్కకంటెను పరిమాణము తక్కువ గలది సున్నము. ఈ మూడు కలిసితే ఎర్రగ మారిపోవు స్వభావము గలవు. తమలపాకుకు చురుకుదనమైన ప్రత్యేకత కలదు. అట్లే వక్కకు కూడ వగరు ప్రత్యేకత గలదు. సున్నము కూడ ఘాటైనది. ఈ మూడు మూడు విధములుగ ప్రత్యేకత కల్గి ఉన్నవి. మన శరీరములో కూడ గుణచక్రములో విశాలమైనది తామసము. దానికంటే పరిమాణములో చిన్నది రాజసభాగము. రాజసముకంటే చిన్నది సాత్త్వికము. ఇపుడు మనము గుణచక్రములో విశాలమైన తామస భాగముగ తాంబూలములో పెద్దదైన తమలపాకును పోల్చుకోవచ్చును. అట్లే రాజసమును వక్కగ, సాత్త్వికమును సున్నముగ పెద్దలు లెక్కించారు. లోపలి నుండి గుణచక్రమున మూడవది తామసము రెండవది రాజసము ఒకటవది సాత్త్వికము. కనుక మూడు ఆకులు, రెండు వక్కలు, ఒక సున్నపు ఉంటను ఉంచెడివారు. తాంబూలములోని మూడు వస్తువులకు ప్రత్యేకమైన రుచులున్నట్లు గుణచక్రములోని మూడు గుణభాగములకు ప్రత్యేకమైన ఆచరణలు కలవు. తాంబూలములోని మూడు వస్తువుల వలన ఎర్రదన మేర్పడినట్లు గుణచక్రములోని మూడు గుణముల వలన కర్మయను ఎర్రదనము ఏర్పడినది. అందువలన జీవాత్మగ ఉన్న నేను కర్మకు కారణమైన మూడు గుణములను నీ ముందరనే వదలి వేయుచున్నాను. గుణములులేని నన్ను నీలోనికి ఐక్యము చేసుకొమ్మని కోరు బాహ్యార్థమే తాంబూలముంచుటని గ్రహించవలెను. ఈ కాలములో పూజా సమయమున తాంబూలముంచిన ఆకులు, వక్కలు మాత్రము ఉంచుచున్నారు. కాని సున్నముంచడము లేదు. రెండు గుణములు పోయిన మూడవది ఉండవలెనన్నట్లు మూడవదయిన సున్నమును పెట్టక పోవడము విచిత్రము. సున్నములేని తాంబూలము దైవసన్నిధిలో అర్థము లేనిదగును.




తాంబూలము

తాంబూలముతో పాటు రకరకములైన తిను బండారములు నైవేద్యముగ ఉంచడము కూడ జరుగుచున్నది. పాయసము, పాలు, అరటిపండ్లు, చెక్కర, పెరుగన్నము, లడ్లు మొదలగునవి నైవేద్యములుగ సమర్పించడము చేయుచున్నారు. ఇవన్నియు తినుబండారములే. ఏ పదార్థములు తినిన ఆ పదార్థము యొక్క రంగు నోటిలో ఏర్పడదు, అన్ని పదార్థములకంటే ప్రత్యేకముగ ఉన్న తాంబూలము తినిన నోరు ఎర్రనగును. అన్ని పదార్థముల రంగు వాసనలను తాంబూలము కప్పివేయుచున్నది. అట్లే ఆహారములైన తిను పదార్థములవలె మన శరీరములో అనేక రకములైన విషయములున్నవి. రకరకములైన విషయములు నాలో ఉండినవి నీకే సమర్పిస్తున్నానను సూచనయే అన్ని విధములైన పదార్థములు నైవేద్యములుగ ఉంచడము. శరీరములోని అన్ని విషయములు మూడు గుణభాగములలోనివేనని చూపు నిమిత్తమే అన్ని పదార్థములను అదిగమించి ఎర్రనగు తాంబూలమునుంచాము. నైవేద్యముగ తినుబండారములనేవైన ఉంచవచ్చును. కొందరు మాంసమును కూడ నైవేద్యముగ పెట్టి పూజలు కలవు. శాఖాహార నైవేద్యమైన మాంసాహార నైవేద్యమైన తాంబూలము నుంచడము అందరు చేయుదురు. దీనిచేత ప్రతి విషయము మూడు గుణములందు ఇమిడి ఉన్నవేనని తెలియుచున్నది. ఈ కాలములో కూడ నైవేద్యములు పెట్టువారు అంతట ఉన్నారు. కాని తాంబూలములో సున్నము పెట్టువారు లేరు. ఒక్క తిరుపతి దేవస్థానములో మాత్రము తాంబూలములో సున్నము పెట్టు సాంప్రదాయమున్నట్లు వినికిడి ఉన్నది. అట్లే మధురవద్ద గల బృంధావనములో కూడ సున్నము పెట్టు సాంప్రదాయము కలదని విన్నాము.